## లవ్‌స్టోరి

# ప్రేమ పావురం

గాలిగోపురం మీద వాలిన నాకు ఏమీ తోచకుండా వుంది. ఎవరి కోసమైనా ఎదురు చూస్తున్నప్పుడు అదోలా వుంటుంది కదా, అలా వుంది

నాతోటి కపోతాలన్నీ రొదచేస్తూ కబుర్లాడుకుంటున్నాయి. ఆరోజు తాము చూసిన వింతలూ, విశేషాలూ చెప్పుకుంటున్నాయి. నాకు వాటిమీద ఆసక్తి లేదు.

నేను అపురూపమైన జంటకోసం ఎదురుచూస్తున్నాను.

మాలో లేని జాతి, వర్ణ, మత విభేదాలున్న మానవజాతికి చెందినవాళ్లే అయినా, వాళ్లిద్దరికీ ఆ తేడాలున్నట్టు కనపళ్లేదు.



నిన్న మసీదుమీద వాలినప్పుడు చూసాను వాళ్లని నేను. తెల్లటి పైజమా, లాల్చీలో అతనూ, సల్వార్-కమీజ్‌లో ఆమె.

అంతక్రితం రోజు ప్రస్తుతంనేను వాలినచోటే-పట్టుచీరకామె వల్ల వచ్చిన అందాన్ని నేను మర్చిపోలేను.

పోయిన నెలలో వో రోజు వాళ్లిద్దరిళ్లముందూ నక్షత్రాలు వెలగడం గమనించాను.

వాళ్ల మొహాల మీద ఎప్పుడూ చెరగని చిరునవ్వులూ, మనసుల్నిండా వున్న ప్రేమా... నేను మీ భాష మాట్లడలేను గాని, వాళ్లు నా మనసులో ఎంత నిండిపోయారో నా కళ్ళలోకి చూస్తే మీకే తెలుస్తుంది.

ఈ రోజు ఉదయం నగరంలోని వో కాలేజీ మీదుగా ఎగుర్తుండగా కనిపించారు వాళ్ళు, నవ్వులు పంచుకుంటూ. వాళ్ల మాటల్లో తెలిసింది నాకు, సాయంత్రం ఇక్కడ కలుసుకుంటారని. అందుకనే ఇక్కడిలా వాళ్ల రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

పుష్యమాసపు సాయంత్రం కావటం వల్నేమో సూర్యుడు పడమటికి జారీ జారక ముందే చీకటి అతణ్ణి తరుముకుంటూ వచ్చేస్తోంది. నిజానికీ చోటంతా తనదే అయినట్టూ, ఏదో కాసేపిక్కడే తిరుగుతానంటే సూర్యుడికి అన్ని జాగ్రత్తలూ చెప్పి అప్పగించి వెళ్లినట్టూ, పరుగు పరుగున వచ్చేసి నగరం మీద తన నల్లటి కంబళీని గబగబా కప్పతోంది. చీకటితో పాటే విచ్చేసింది చల్లటి గాలి.

దీపాలు వెలుగుతుండగానే ఈ సౌందర్యాన్ని ఏ మాత్రం ఆస్వాదించకుండా వీధుల్లో జనం ఇళ్లకేసి తిరుగుముఖం పడ్తున్నారు. వో వారం క్రితందాకా నగరాన్ని కుదిపేసిన కల్లోలాలు ఇంకా పూర్తిగా చల్లారలేదు మరి!

* * *

**-టి. వి. కె. దాస్**

హమ్మయ్య నా నిరీక్షణ ఫలించింది.

అరుగో... వస్తున్నారు వాళ్లిద్దరూ.

ఆమెది అచ్చెరువందించే అందం. బుగ్గల్లో గులాబీలు, పెదాల మీద మందార మొగ్గలు అద్దినట్టూ వొళ్లంతా మల్లెలతో నింపినట్టూ- 'కార్తికేయ' లాంటి సుప్రసిద్ధ చిత్రకారుడెవరో గీసిన అందమైన బొమ్మలాగా వుంది ఆమె. గాలికి రెపరెపలాడుతున్న చీర ఆమె తనని ధరించినందుకు కృతజ్ఞతగా కేరింతలు కొడుతున్నట్టుంది.

అతనామెకు సరిజోడీ. పొడుగ్గా, కాకింత సన్నగా, కళ్లనిండా ఆమె మీది ప్రేమ- మీసాల చాటున ఆమె తనదేనన్న గర్వం; సూటిగా వున్న అతని ముక్కు చూస్తే తెలుస్తోంది, భవిష్యత్తంతా తనదే అన్న అతని అపారమైన నమ్మకం.



''ఇక్కడ కూర్చుందామా?'' అతని గొంతులోని తియ్యదనం నాకే ముద్దొస్తూంది. ఆమె కూర్చుంటూ, ఎందుకో తలెత్తి నావేపు చూసింది.

''ఏయ్- అటు చూడు. ఆ పావురం. అదే, అక్కడ వాలిన వాటన్నిట్లోకీ తెల్లగా వుందే అది. అది మనల్నే చూస్తున్నట్టుగా లేదూ?'' అందామె.

''అందులో ఆశ్చర్యమేముంది? మనిద్దరం ప్రేమకి చిహ్నామైతే అది శాంతికి గుర్తు. ప్రేమ వున్న చోట శాంతి ఎప్పుడూ వుంటుంది కదా!'' అన్నాడతను.

చలికి నేను రెప్పలు టపటపమనిపించాను. ఆమె భుజం చుట్టూ పైట తిప్పి కప్పుకుంది- ''నీ మాటలకేనేమో అది చప్పట్లు కొడుతోంది'' అన్నది.

అతను నెమ్మదిగా పక్కకి వొరిగి ఆమె బుగ్గ మీద పెదాల్తో చిన్నగా స్పృశించాడు.

నాకాశ్చర్యంగా వుంది. వాళ్ల రాకపూర్వం నాకు కాలం గడిచినట్టే అనిపించలేదు. నేనో వొంటరి పక్షిననిపించింది. ఇప్పుడు పరుగెడుతున్నట్టనిపిస్తోంది.

ప్రేమైక జీవుల్లా ఆమె, అతనూ-ఆ మాటలూ, వొకళ్ల వొడిలో వొకళ్లు అల్లరిగా పడుకోడం, కళ్లు అల్లల్లాడిస్తూ ఆడుకోవడం-

''ఇంక లేద్దామా?'' అందామె గడియారం వంక చూస్తూ.

అతను లేచి నిలబడ్డాడు.

నా మనసు వేదనతో నిండింది. నాకు వాళ్లనప్పుడే వదలాలని లేదు. నేల మీద వాళ్లు నడుస్తుంటే వాళ్ల పైగా ఎగుర్తూ వెళ్లసాగాను.

నగరం దాదాపు నిర్మానుష్యంగా వుంది.

పోలీసు జీపులు మధ్య మధ్యలో వేగంగా వెళ్తూ కనపడుతున్నాయి.

నా ప్రియమైన యువతీ యువకులు చేతులు పట్టుకుని నడుస్తున్నారు.

ఆ మనోహర దృశ్యం చూస్తూ నేను ఎగురుతున్నాను.

ఇంతలో-

''ఎవరతను?''

మనసేదో కీడు శంకించింది.

''ఏయ్ మిస్టర్ నువ్వు... కదూ?'' ఆ వచ్చినతనడిగింది ఆ యువకుని పేరు కాదు. అది వో మతం పేరు.

నా 'ప్రేమికుడి' పెదాల మీద చిరునవ్వు చెరిగింది కాదు.

''మీరు ...''

అతని మాట పూర్తి కాలేదు. ఆగంతకుడి చేతిలో కత్తి అతని గుండెల్లో దిగబడింది. నాకు బాధతో పిచ్చెక్కినట్టవుతోంది. నాకు తెలీకుండానే నేను రోదించసాగాను.

దూరాన్నించి ఏదో కాంతి కనపడితే చూసాను. పోలీసు జీపొకటి ఇటుకేసి వస్తోంది. కొద్దిగా ఆనందం పొడచూపింది నాలో.

కానీ, ఈలోగా ఆగంతకుడు కత్తిని అతని వొంట్లోంచి లాగి ఆమె మీదికి విసిరాడు.

జీపు లైట్ల కాంతిలో కత్తి ఆమెని తాకింది.

మతవాదం ప్రేమని సంపూర్ణంగా నాశనం చేసింది.

శాంతికి చిహ్నామైన నేను గుడ్లప్పగించి చూస్తున్నాను.

జీపులో పోలీసు లేచి నిలబడ్డాడు. 'త్వరగా కాల్చి పారెయ్యండి' అని అరవాలనిపించింది నాకు.

అతను కాల్చాడు-కానీ గాల్లోకి.

''అబ్బా!'' గుండు నా గుండెల్లో దిగబడింది. నేను నేలకొరిగిపోతున్నాను, నా నేస్తాలదగ్గరికి!

●●